కాంట్రాక్ట్‌ ఉద్యోగులకు భద్రత కల్పించాలి

చర్లపల్లి పారిశ్రామికవాడలో సదస్సు


మాట్లాడుతున్న సీఐటీయూ నేత భూపాల్‌

కుషాయిగూడ: నాన్‌ పర్మనెంట్‌ కాంట్రాక్ట్‌ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు భూపాల్‌, చర్లపల్లి ఇండస్ట్రియల్‌ ఎంప్లాయిస్‌ యూనియన్‌ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. నాన్‌ పర్మనెంట్‌ కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై గురువారం చర్లపల్లి పారిశ్రామికవాడలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సదస్సు దృష్టికి తీసుకెళ్లారు. కార్మికులకు కనీస వసతులు కల్పించకుండా వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని ఆరోపించారు. కంపెనీల్లో షెడ్లు నిర్మించి ఎలాంటి సౌకర్యాలు లేకుండా పరిమితికి మించి కార్మికులను ఉంచుతున్నారన్నారు. కార్మికులకు రూ.26 వేల కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. వారికి ఉద్యోగభద్రత కల్పించడంతో పాటుగా ఈఎస్‌ఐ, పీఎఫ్‌, బోనస్‌, ఎర్న్‌లీవ్స్‌ వంటివి వర్తించేలా చూడాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉందన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌, వెంకటేష్‌, నరసింహ, ఆదామ్‌, సంతోష్‌, బాబురావు, మోయిన్‌పాషా, శ్రీనివాస్‌, నరసమ్మ, లావణ్య, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో వసతుల కల్పనకు కృషి


చిలుకానగర్‌లో అదనపు గదుల నిర్మాణానికి కొలతలు తీసుకుంటున్న అధికారులు

ఉప్పల్‌: చిలుకానగర్‌ ప్రభుత్వ పాఠశాలకు అదనపు గదుల లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కార్పొరేటర్‌ బన్నాల గీత, ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయాన్ని డైరెక్టర్‌ ఆఫ్‌ స్కూల్‌ ఎడ్యుకేషన్‌ నర్సింహారెడ్డి దృష్టికి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. డైరెక్టర్‌ నర్సింహారెడ్డి ఆదేశాల మేరకు స్పందించిన అధికారులు చిలుకానగర్‌ ప్రభుత్వ పాఠశాలకు వచ్చి ఆరా తీశారు. కొలతలను తీసుకుని త్వరలో నిధులను కేటాయించనున్నట్లు అధికారులు చెప్పారు. బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్‌, ఎద్దుల కొండల్‌రెడ్డి, ఉపాధ్యాయులు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌ పర్యటన


స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్‌ రజితాపరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్‌: ఉప్పల్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి గురువారం స్థానిక కాలనీ అసోసియేషన్‌ ప్రతినిధులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు సీసీ రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలను కార్పొరేటర్‌ దృష్టికి తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన ఆమె త్వరలోనే నిధులు మంజూరు చేయించి సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ఉప్పల్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్‌, నరహరి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన



బోడుప్పల్‌: నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో 19వ డివిజన్‌లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. గురువారం బోడుప్పల్‌ లోటస్‌ ల్యాప్‌ పబ్లిక్‌ స్కూల్‌ విద్యార్థులు, ఉపాధ్యాయులకు పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా 13వ డివిజన్‌లో మున్సిపల్‌ అధికారులు, సిబ్బంది మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నారాయణరెడ్డి, కమలాకర్‌, హెల్త్‌ అసిస్టెంట్‌ వినోద్‌, స్వచ్ఛ భారత్‌ మిషన్‌ కో– ఆర్డినేటర్లు మల్లేష్‌, మహేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

అల్వాల్‌: ప్రభుత్వ జూనియర్‌ లెక్చరర్ల సంఘం మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం మల్కాజిగిరిలోని ప్రభుత్వ కళాశాలలో జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా సీహెచ్‌. విద్యాసాగర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సిద్ధిరాంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్‌ ఎం.గోపి, కోశాధికారిగా చంద్రశేఖర్‌, సంయుక్త కార్యదర్శిగా మురళి, స్టేట్స్‌ కౌన్సిలర్లుగా ఉపేందర్‌, పీవీ. రమణారెడ్డి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా నాగేందర్‌, ఉమాదేవీ వ్యవహించారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.



పారిశుద్ధ్య కార్మికులకు బియ్యం పంపిణీ



మల్కాజిగిరి: ఈస్ట్‌ ఆనంద్‌బాగ్‌ డివిజన్‌లో బీజేపీ జిల్లా నాయకుడు బాలచందర్‌ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీ ఈటల రాజేందర్‌ హాజరై ఇంటింటికీ తిరిగి సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతం చేయాలని ఆయన సూచించారు. అనంతరం సేవా మహాయజ్ఞంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు బియ్యం పంపిణీ చేశారు. ఆర్‌కే. శ్రీనివాస్‌, అసెంబ్లీ కన్వీనర్‌ డీఎస్‌. వెంకటేష్‌, వీకే. మహేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఈటలను కలిసిన స్థానికులు


ఎంపీ ఈటల రాజేందర్‌తో జొన్నబండ, వడ్డెర బస్తీవాసులు

అల్వాల్‌: బీజేపీ సీనియర్‌ నేత వై. గోపి ఆధ్వర్యంలో జొన్నబండ, వడ్డెరబస్తీ ప్రాంత ప్రజలు ఎంపీ ఈటల రాజేందర్‌ను ఆయన నివాసంలో గురువారం కలిశారు. గత 4 రోజులుగా వారి ఇళ్లకు తహసీల్దార్‌ సిబ్బంది నోటీసులు ఇవ్వడంతో హైడ్రా కూల్చివేస్తుందేమోనని ఆందోళనకు గురయ్యామన్నారు. 1986 నుంచి ఇక్కడ సర్వేనంబర్‌ 582, 583లో వడ్డెర పనిచేసుకుంటూ.. నివసిస్తున్నామని ఇళ్లకు టాక్స్‌ కడుతున్నామని, ప్రభుత్వం సీలింగ్‌ స్థలమని ఈ స్థలంలో ఇళ్లను కూల్చివేయడంపై ఎంపీ ఎదుట వాపోయారు. సానుకూలంగా స్పందించిన ఈటల వెంటనే కలెక్టర్‌, తహసీల్దార్‌లతో మాట్లాడి ఎలాంటి తక్షణ చర్యలు తీసుకోకూడదని స్పష్టం చేశారు. త్వరలో పర్యటిస్తానని నివాసితులకు ఎంపీ భరోసా ఇచ్చారు.

భూదాన్‌ స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న అల్వాల్‌ తహసీల్దార్‌ రాములు, కార్పొరేటర్‌ శాంతి

అల్వాల్‌: ఓల్డ్‌ అల్వాల్‌లోని కిష్టమ్మ ఎన్‌క్లేవ్‌లోని భూదాన్‌ స్థలాన్ని గురువారం అల్వాల్‌ తహసీల్దార్‌ రాములుతో కలిసి స్థానిక కార్పొరేటర్‌ చింతల శాంతిశ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. భూదాన్‌ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూడాలని తహసీల్దార్‌ను కార్పొరేటర్‌ కోరగా.. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్‌ వివరించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ రమ్య, స్థానిక నాయకులు యాదగిరిగౌడ్‌, శరణ్‌, గిరి, ప్రేమ్‌కుమార్‌, సాజిద్‌ తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా 'డర్‌' !

- తమ ఇళ్లు కూల్చివేస్తారనే ఆందోళనలో స్థానికులు
- ప్రాణాలైనా వదిలేస్తామని, ఇళ్లు వదలమన్న నివాసితులు
- స్పష్టం చేసిన రామంతాపూర్‌ మూసీనది బఫర్‌జోన్‌ వాసులు


ఆందోళనలో రామంతాపూర్‌ మూసీ బఫర్‌జోన్‌ వాసులు


మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్‌

రామంతాపూర్‌: రామంతాపూర్‌ భగాయత్‌ మూసీ పరివాహక ప్రాంతంలోని బఫర్‌జోన్‌లో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాలు హైడ్రా తమ ఇళ్లను కూల్చివేస్తుందనే వార్తలతో స్థానికులు భయాందోళకు గురయ్యారు.

పైసా పైసా కూడగట్టుకుని.. స్థలాలు కొని..

తాము అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్నామని, ఇప్పుడేమో హైడ్రా పేరిట అధికారులు వచ్చి ఇళ్లు కూలుస్తామనడం దారుణమని బఫర్‌జోన్‌ వాసులు గురువారం ఆందోళనకు దిగారు. పైసా పైసా కూడపెట్టుకున్నామని, రామంతాపూర్‌ మూసీ బఫర్‌ జోన్‌లో స్థలాలు కొని అప్పులు చేసి ఇల్లు నిర్మించుకున్నామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సుందరీకరణ పేరిట ఇళ్లను కూల్చివేస్తామనడం తగదని వారు వాపోయారు. ఈ స్థలాలను మేము కబ్జా చేయలేదని డబ్బులు పెట్టి కొన్న స్థలాలేనన్నారు.

ప్రాణత్యాగానికైనా సిద్ధం..

అధికారులు తమ ఇళ్లను కూల్చివేస్తే ప్రాణ త్యాగాలకైనా సిద్ధపడతామని కానీ ఎంతో దూరంలో ఉన్న డబుల్‌బెడ్రూమ్‌లు మేము తీసుకోవడానికి సిద్ధంగా లేమని నివాసితులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు మూసీ పరివాహక ప్రాంతాన్ని తమ ఇళ్లను వదిలేసి సుందరీకరణ చేసుకునే అవకాశం ఉందని దానిని పక్కన పెట్టి ప్రభుత్వం తమ ఇళ్లపై పడటం సరికాదన్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించుకుని తమ ఇళ్లను వదిలేసి సుందరీకరణ చేసుకుంటే మాకు ఎవరికీ అభ్యంతరం లేదని వారు సూచిస్తున్నారు.

పేదలకు న్యాయం చేస్తా: ఎంపీ ఈటల రాజేందర్‌

రామంతాపూర్‌ మూసీ బఫర్‌జోన్‌ వాసులు గురువారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ కలిసి బఫర్‌జోన్‌లోని తమ ఇళ్లను కూల్చడానికి అధికారులు సిద్ధపడుతున్నారని వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందిస్తూ.. బఫర్‌ జోన్‌లోని ఇళ్లను కూల్చివేయకుండా పూర్తి స్థాయిలో కృషి చేస్తానని శుక్రవారం మూసీ బఫర్‌జోన్‌ బాధితులు నిర్వహిస్తున్న సమావేశంలో తాను పాల్గొంటానని ఈటల చెప్పారు.

ఇళ్లను వదలం..



రామంతాపూర్‌ మూసీ బఫర్‌జోన్‌లో గత 15 ఏళ్ల క్రితం అప్పు చేసి నిర్మించుకున్న ఇళ్లను సుందరీకరణ పేరుతో ప్రభుత్వం కూల్చివేయడానికి సిద్ధపడటం దారుణం. పైసా పైసా కూడబెట్టుకుని అప్పులు చేసి గృహాలు నిర్మించుకున్నాం. అప్పుడు అభ్యంతరం చెప్పని ప్రభుత్వం ఇప్పుడు కూల్చివేస్తామనడం సరికాదు. మా ఇళ్లను వదిలేసి సుందరీకరణ పనులు చేపట్టుకోవచ్చు ఒకవేళ ప్రభుత్వం మొండి వైఖరితో ఇళ్లను కూల్చడానికి వస్తే ప్రాణ త్యాగానికైనా సిద్ధమవుతాం.

– నరసింహారెడ్డి, రామంతాపూర్‌ మూసీ బఫర్‌జోన్‌ నివాసి

డబుల్‌ బెడ్రూమ్‌లు మాకు వద్దు..



రామంతాపూర్‌ మూసీ బఫర్‌జోన్‌లో ఇళ్లు కూల్చివేసి ఎక్కడో ఉన్న డబుల్‌ బెడ్రూమ్‌లు ఇస్తాననడం సరికాదు. మేము చేసే కూలీ పనులు చిన్న చిన్న ఉద్యోగాలు ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. వాటిని వదిలేసి ఎక్కడికో వెళ్లాలంటే ఇబ్బందికరంగా ఉంటుంది. అందుకే ప్రభుత్వం వెంటనే ఇళ్లను కూల్చకుండా మూసీ సుందరీకరణ పనులు చేపట్టుకోవచ్చు. ఒకవేళ మా ఇళ్లను కూల్చివేస్తే తీవ్రంగా అడ్డుకుంటాం.

– దుర్గాకుమారి, మూసీ బఫర్‌జోన్‌ నివాసి

ఉప్పల్‌ సీపీఎం శాఖ కార్యదర్శిగా ఊర్మిళ



ఉప్పల్‌: ఉప్పల్‌ సీపీఎం మహాసభ శాఖ కార్యదర్శిగా ఉప్పల్‌కు చెందిన ఊర్మిళను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి ఆశయ సాధనకు కృషి చేస్తానన్నారు. పార్టీ పటిష్టతకు తనవంతు కృషి చేయనున్నట్లు వివరించారు. జె. వెంకన్న, ఆంజనేయులు, మేరి సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఎమ్మెల్యే చేయూత



కాప్రా: ఎంబీబీఎస్‌ సీటు సాధించి ఫీజు కట్టలేని నిరుపేద విద్యార్థుల ఫీజు చెల్లించే బాధ్యత తనదని, ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చిలుకానగర్‌ డివిజన్‌కు చెందిన సత్యనారాయణ కుమార్తె కీర్తన ఎల్బీనగర్‌లోని కామినేని అకాడమీ మెడికల్‌ సైన్స్‌ అండ్‌ రీసెర్చ్‌ సెంటర్‌లో ఎంబీబీఎస్‌ రెండో సంవత్సరం చదువుతోంది. కాలేజీ ఫీజు కట్టలేక కీర్తన తండ్రి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి రూ. 60 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ చెక్కును గురువారం మేడ్చల్‌ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్‌లో ఎంపీ ఈటల రాజేందర్‌ సమక్షంలో కలెక్టర్‌ గౌతమ్‌ చేతుల మీదుగా విద్యార్థినికి అందజేశారు.

పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం



కార్యక్రమంలో స్మితాసింగ్‌, పారిశుద్ధ్య సిబ్బంది

మేడిపల్లి: పరిసరాల పరిశుభ్రతతో పాటు పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని కామ్‌ ఫౌండేషన్‌ సీఈఓ, డాక్టర్‌ స్మితాసింగ్‌ అన్నారు. పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలో గురువారం నిర్వహించిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో ఆమె, ట్రైనర్‌ మిథున్‌కుమార్‌ పాల్గొని పారిశుద్ధ్య కార్మికులకు వర్క్‌షాప్‌ నిర్వహించారు. శానిటేషన్‌ సిబ్బంది పనిచేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్యంగా ఉండటానికి పాటించాల్సిన నియమాలు, ప్రభుత్వం నుంచి వచ్చే సదుపాయాలు, స్కీముల గురించి వివరించారు. కమిషనర్‌ అమర్‌సింగ్‌, కమిషనర్‌ త్రిలేశ్వర్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌రెడ్డి, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన ..

స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఐటీసీ ఆధ్వర్యంలో 500 మంది విద్యార్థులకు ఎం కన్వెన్షన్‌హాల్‌లో తడి చెత్త, పొడి చెత్త, హానికర చెత్త సేకరణ, వేరు చేయడం, ప్లాస్టిక్‌ వాడకం తగ్గించడం, నియంత్రించడంపై అవగాహన కల్పించారు. మేయర్‌ అమర్‌సింగ్‌, కమిషనర్‌ త్రిలేశ్వర్‌రావు, 24వ డివిజన్‌ కార్పొరేటర్‌ అనంత్‌రెడ్డి, ఎన్విరాన్‌మెంట్‌ ఇంజినీర్లు బాలమురళీకృష్ణ, సుధా పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌ బకాయిలు విడుదల చేయాలి


ధర్నా చేస్తున్న విద్యార్థినులు

రామంతాపూర్‌: భారత ఐక్యవేదిక ఫెడరేషన్‌ హైదరాబాద్‌ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న రూ.8,500 కోట్ల స్కాలర్‌షిప్‌ రీయింబర్స్‌మెంట్‌లను తక్షణమే విడుదల చేసి విద్యార్థుల ఖాతాలో వేయాలని రామంతాపూర్‌లోని మెగా ఉమ్మెన్‌ డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మునావత్‌ కోటేష్‌, మణికంఠ మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ముగిసి 9 నెలలు గడిచిందని, కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చినా విద్యార్థుల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్కాలర్‌షిప్‌ ఫీజు రీయింబర్స్‌మెంట్లు విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. విద్యార్థి నేతలు రాజేష్‌నాయక్‌, రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

వీరవనిత చాకలి ఐలమ్మ


ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మేయర్‌ అజయ్‌యాదవ్‌

ఉప్పల్‌, మల్కాజిగిరి జోన్‌ పరిధిలో వీరవనిత చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం ఆమె విగ్రహం, చిత్రపటానికి పలు పార్టీల నేతలు, అధికారులు ఘనంగా నివాళులర్పించారు.

– ఉప్పల్‌, మల్కాజిగిరి జోన్‌ బృందం



రామంతాపూర్‌లో కాంగ్రెస్‌ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి, రజక సంఘం నేతలు


ఈసీఐఎల్‌ చౌరస్తాలో నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి


జ్యోతినగర్‌లో రజక సంఘం, బీసీ కులాల ఐక్య వేదిక ప్రతినిధులు

సీఎం రిలీఫ్‌ఫండ్‌ పేదల పాలిట వరం


బాధిత కుటుంబానికి ఎల్‌ఓసీని అందజేస్తున్న కార్పొరేటర్‌ శ్రీదేవి

కుషాయిగూడ: సీఎం సహాయనిధి పేదల పాలిట వరమని కార్పొరేటర్‌ బొంతు శ్రీదేవి అన్నారు. చర్లపల్లి డివిజన్‌కు చెందిన బాల్‌రెడ్డి గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మెరుగైన వైద్యం చేయించుకోవడం కోసం ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో కార్పొరేటర్‌ను సంప్రదించారు. దీంతో ఆమె సీఎం సహాయనిధి నుంచి రూ. 3,25,000ల ఎల్‌ఓసీని మంజూరు చేయించి గురువారం వారి కుటుంబసభ్యులకు అందజేశారు. స్థానిక నేతలు నాగిళ్ల బాల్‌రెడ్డి, బత్తుల శ్రీకాంత్‌యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

సీఎన్‌జీ ప్లాంట్‌ పరిశీలన


చెత్త నుంచి తయారైన ఎరువును పరిశీలించిన కార్పొరేటర్‌ శ్రవణ్‌

మల్కాజిగిరి: ఇండోర్‌ పర్యటనలో భాగంగా మల్కాజిగిరి కార్పొరేటర్‌ చెత్త నుంచి బయో సీఎన్‌జీ తయారయ్యే ప్లాంట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ శ్రవణ్‌ మాట్లాడుతూ.. ఇండోర్‌ చెత్త సేకరణతో పాటు దానిని ఉపయోగించే పద్ధతులు అద్భుతంగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా తడి, పొడి చెత్తను వేర్వేరుగా ప్రాసెస్‌ చేసి పొలాలకు ఎరువుగా తయారు చేస్తూ.. ప్రతి రోజూ రూ. 20 లక్షల ఆదాయాన్ని పొందుతున్నారన్నారు. హైదరాబాద్‌లో ఈ విధానాలను తీసుకురావడం వల్ల ఎక్కువ ఉపయోగం ఉంటుందన్నారు.

'ఏఐఆర్‌ కదంబ'కు విద్యార్థుల ఎంపిక


రికార్డింగ్‌లో పాల్గొన్న నేషనల్‌ హైస్కూల్‌ విద్యార్థులు

మల్కాజిగిరి: ఆల్‌ ఇండియా రేడియో హైదరాబాద్‌ నిర్వహించిన పిల్లల కదంబ కార్యక్రమానికి మల్కాజిగిరి ఆర్‌కేనగర్‌లోని నేషనల్‌ హైస్కూల్‌ విద్యార్థులు ఎంపికయ్యారని కరస్పాండెంట్‌ రవికిరణ్‌ తెలిపారు. ఈనెల 29న రేడియోలో మధ్యాహ్నం ప్రసారమవుతుందని పాఠశాల విద్యార్థులకు అవకాశం దక్కడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు సంజన, లతా చౌహాన్‌, చందన, ఝాన్సీ, రితిక, హర్షిత, ఉషశ్రీ, ఇందు, ప్రసన్నలక్ష్మి, విష్ణు, సంతోష్‌, హర్ష, గౌతమ్‌, మేఘనాథ్‌లతో పాటు వారిని సమన్వయం చేసిన హిందీ టీచర్‌ సీమా కులకర్ణి, తెలుగు టీచర్‌ సత్యవతి, కంప్యూటర్‌ టీచర్‌ భవానిని ఆయన అభినందించారు.

ప్రతి ఒక్కరూ వృద్ధులను గౌరవించాలి



మల్లాపూర్‌: ప్రతి ఒక్కరూ వృద్ధులను గౌరవించాలని మేడ్చల్‌ జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఎం.కృష్ణారెడ్డి అన్నారు. మేడ్చల్‌ మల్కాజ్‌గిరి జిల్లా స్త్రీ,శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాన్ని గురువారం నాచారం సాధన వృద్ధాశ్రమంలో వృద్ధులపై అవగాహన, సున్నితత్వ అనే అంశంపై కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణారెడ్డి వృద్ధులను గౌరవించడంతో పాటు సేవలను అందించడం, వారి పట్ల మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. సీడీపీఓ అధికారి స్వాతి, యాదగిరి, సాధన సంస్థ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, డైరెక్టర్‌ సురేఖరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి


సమావేశంలో ఎమ్మెల్యే మర్రి, పోలీసులు, ఇతర అధికారులు

అల్వాల్‌: అధికారులు నిష్పక్షపాత వైఖరితో వ్యవహరించి అట్రాసిటీ కేసుల్లో దళితులకు న్యాయం జరిగేలా చూడాలని పోలీసులు ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా పనిచేయాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం నేరేడ్‌మెట్‌లోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్‌డీఓ శ్యామ్‌ప్రకాష్‌ చైర్మన్‌గా షెడ్యూల్డ్‌ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. షెడ్యూల్డ్‌ కులాల వారికి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయడంలో తహసీల్దార్‌ పారదర్శకత పాటించాలని తెలిపారు. మల్కాజిగిరి నియోజకవర్గంలోని అరవ మాలలకు కుల ధ్రువీకరణ సర్టిఫికెట్‌ ఇవ్వడంలో చాలా జాప్యం జరుగుతుందని, అనేక నిబంధనలు పెట్టడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయంలో ఆర్డీఓ చొరవ తీసుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్డీఓ శ్యామ్‌ప్రకాష్‌తోపాటు వివిధ శాఖల పోలీస్‌ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వేంకటేశ్వర దేవస్థానం హుండీ లెక్కింపు దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్‌ కర్క మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో గురువారం జరిగింది. 58 రోజుల హుండీ లెక్కింపులో రూ.2,87,386 ఆదాయం వచ్చిందని ఈవో రవీందర్‌రెడ్డి ప్రకటించారు. ప్రధాన అర్చకులు ఉన్నారు.